సాక్షి తిరుపతి

ఆదివారం । 16 । మార్చి । 2025



ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

జిల్లాలోని ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాలకృష్ణనాయక్ సూచించారు. - 8లో



తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తా

తిరుపతి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి అధికారి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా)	సహర్ సోమవారం (ఉ)
తిరుపతి	6-26	5-00
గూడూరు	6-20	4-56

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 576 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 27,869 మంది, ఒకేషనల్‌లో 818 మంది మొత్తం 28,687 మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉంది. అయితే వీరిలో జనరల్‌లో 518, ఒకేషనల్‌లో 58, మొత్తం 576 మంది విద్యార్థులు గైర్హాజరవ్వడంతో 28,111 మంది పరీక్ష రాసినట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షతో ప్రధాన పరీక్షలు ముగిశాయని తెలిపారు. సోమవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్‌మెటిక్స్(బైపీసీ) సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ పేర్కొన్నారు.

ఒంటి పూటబడులు అమలు చేయాలి

తిరుపతి ఎడ్యుకేషన్ :జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు తప్పనిసరిగా ఒంటి పూటబడులను అమలు చేయాలని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. అకడమిక్ క్యాలెండర్ మేరకు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటి పూట బడులను ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పాఠశాలల్లో పంచాయతీ, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ, ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో తాగునీటి వసతి కల్పించాలని, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే మధ్యాహ్నం పాఠశాల ముగిశాక తప్పనిసరిగా మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. వీటన్నింటిపై డీవైఈఓలు, ఎంఈఓలు వారి పరిధిలోని అన్ని పాఠశాలలను పర్యవేక్షించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రధానోపాధ్యాయులు తగిన ఏర్పాట్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒంటి పూట బడి నిబంధనలను పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

డిగ్రీ పరీక్షల ఫీజు గడువు 19 వరకు పొడిగింపు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్లకు సంబంధించి పరీక్షల ఫీజు గడువును ఈనెల 19వ తేదీ వరకు పొడిగించారు. ఆదివారంతో ముగియనున్న గడువును విద్యార్థుల, కళాశాలల యాజమాన్యాల అభ్యర్థన మేరకు మరో మూడు రోజుల పాటు అధికారులు పొడిగించారు. దీంతో విద్యార్థులు పరీక్ష ఫీజును బుధవారంలోపు చెల్లించాల్సి ఉంటుంది.

SUNDAY SPECIAL

ఆన్‌లైన్..ఆహారం



భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం..వ్యాపార నిమిత్తం ఉదయం నుంచి ఉరుకుల పరుగుల మయం.. రాత్రి ఎప్పటికో ఇంటికి చేరే వైనం .. దీనికితోడు పిల్లల అభ్యున్నతికి ఆరాటం.. నిత్యం బతుకు పోరాటం.. ఇదీ నేటి నగర జీవనం.. ఈ స్థితిలో వంట తయారీకి దొరకని సమయం.. కొత్తజంటలకు వంట చేయడం తెలియనితనం.. వెరసి..హోటళ్లలో భోజనమే ఆధారం..అక్కడి వరకూ వెళ్లడానికి ఓపిక లేనితనం.. ఆన్‌లైన్ భోజనం ఆరగించడానికే మొగ్గు చూపుతున్న జనం. ఫలితం రోజురోజుకూ పెరుగుతున్న ఇంటి వద్దకే భోజనం సంప్రదాయం.

ఆన్‌లైన్ ఆహారం వివరాలివీ..

మహిళా ఉద్యోగులు	12,875
నూతన జంటలు	2,140
భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైన కుటుంబాల సంఖ్య	7,396
బ్యాచులర్లు	10,250
విశ్రాంత ఉద్యోగులు	3,256
ఒంటరి మహిళలు, పురుషులు	895
వ్యాపారవేత్తలు	1,276
సందర్భం ఆధారంగా ఆన్‌లైన్‌ను ఆశ్రయిస్తున్నవారు	2,564



వంటతో పెద్ద తంటా

- పని ఒత్తిడితో వంటగదికి మహిళలు దూరం
- ఆన్‌లైన్ ఆర్డర్లు వైపు మొగ్గు
- సెలవురోజుల్లో హోటళ్లకు వెళ్లడం ఫ్యాషన్‌గా భావిస్తున్న కుటుంబాలు
- తిరుపతిలో పెరిగిన జొమోటో, స్విగ్గీ కల్చర్
- వంటగదిపై ఆసక్తి చూపని 40 శాతం మంది మహిళలు
- సమయపాలన, ఒత్తిడే కారణం
- రుచికర ఆహారానికి ఆకర్షితులవుతున్న పిల్లలు

తిరుపతి తుడా: నగర జీవనం బిజీబిజీగా గడుస్తోంది. మెరుగైన జీవనం కోసం భార్యాభర్తలిద్దరూ కష్టపడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులుగానో.. వ్యాపారం వైపో పరుగులు పెడితేగాని కుటుంబాలు ముందుకు సాగడంలేదు. ఈ క్రమంలో పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, బిజీలైఫ్‌తో మహిళలు వంటగది వైపునకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పిల్లలు, కుటుంబం, ఉద్యోగం ఇతర పనుల్లోనూ మహిళలు భాగస్వాములు కావడంతో వంట అదనపు భారం అవుతోంది. ఈ క్రమంలోని ఎక్కువ కుటుంబాలు ఆన్‌లైన్ ఫుడ్‌పై ఆధారపడుతున్నాయి. ఇక సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు కుటుంబ సమేతంగా హోటల్లోకి వెళ్లి పూట గడిపేస్తున్నాయి. మరికొందరు అన్నం వండుకుని కర్రీలు తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో తిరుపతి నగరంతోపాటు జిల్లాలోని కొన్ని పట్టణాల్లో ఆన్‌లైన్ డెలివరీ ఇచ్చే జొమోటో, స్విగ్గీ వంటి సంస్థలు విస్తరించాయి. ఇంట్లో కూర్చొని కావాల్సిన ఆహారం నచ్చిన హోటల్ నుంచి తెప్పించుకోవడం చాలా మందికి ఫ్యాషన్‌గా మారింది. ఈ క్రమంలోనే ఫుడ్ డెలివరీ క్రమేణా పెరుగుతోంది. నగరంలో ఆన్‌లైన్ ఆహారంపై ఆధారపడిన వారి వివరాలను ఓ సర్వే సంస్థ అంచనా వేసింది.

విలాస జీవనానికి కొత్త జంటల ఆరాటం

కొత్త జంటలు విలాసవంత జీవనానికి అలవాటు పడ్డాయి. దీనికితోడు పలువురు యువతులు పుట్టింట్లో వంటల ఓనమాలు నేర్చుకోకుండా అల్లారు ముద్దుగా పెరుగుతున్నారు. ఈ క్రమంలో అత్తారింట సైతం అలానే కొనసాగాలనే ఉద్దేశంతో పెళ్లైన కొత్తలోనే వేరు కాపురాలు పెడుతున్నారు. దీంతో భార్యాభర్తలిద్దరూ ఆన్‌లైన్ ఆర్డర్లు, హోటళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. మరికొందరు కొత్తగా కాపురం పెట్టి వంట చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. కొందరు యూట్యూబ్ చానళ్లు చూసి వంట పాఠాలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వండిన వంట రుచికరంగా లేకపోవడంతో అబ్బాయిలు ఆమాడదూరం వెళ్లిపోతున్నారు. దీంతో వంట తంట నుంచి తప్పించుకునేందుకు ఆన్‌లైన్‌ను ఆశ్రయిస్తున్నారు.

ఆన్‌లైన్ ఆర్డర్ల వైపు మొగ్గు



కుటుంబ వ్యవహారాలతోపాటు ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తిస్తూ పురుషులతోపాటు మహిళలు సైతం అలసిపోతున్నారు. ఒత్తిడి కారణంగా ఇంటికి వచ్చి వంట చేసే ఓపిక లేక చాలా మంది మహిళలు వంట తయారీపై ఆసక్తి చూపడం లేదు. అన్నం, కూరలు లేదా టిఫిన్ కర్రీలను వండుకునేందుకు గంటకుపైగా సమయం పడుతుంది. ఆ సమయంలో పిల్లలతో గడపడం, విశ్రాంతి తీసుకోవడం, ఇంట్లో ఇతర పనులను చక్కబెట్టుకునేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లపై కుటుంబ సమేతంగా మొగ్గు చూపుతున్నారు. నగరంలోని ప్రముఖ హోటళ్ల జొమోటా, స్విగ్గీ సేవలను అందుబాటులో ఉంచడంతో ఆన్‌లైన్ రేటింగ్ ఆధారంగా హోటల్‌ను ఎంపిక చేసుకుని నచ్చిన ఆహారం తెప్పించుకుంటున్నారు. అలానే మరి కొన్ని హోటళ్లలో ఫుడ్ ఆర్డర్ పెట్టుకుంటే నేరుగా ఇంటికి తెచ్చించే వెసులుబాటును యజమానులు కల్పించారు. ఆర్డర్ పెట్టుకున్న అర్ధగంటలోపే ఇంటికే నచ్చిన ఆహారం తెప్పించుకుని ఆరగిస్తున్నారు. 40 శాతం కుటుంబాలు ఆన్‌లైన్ ఆహారంతో గడిపేస్తున్నారు.



హోటల్‌కు వెళ్లడం ఫ్యాషన్

సెలవు రోజులు, ఇతర ప్రత్యేక దినాలు, కుటుంబంలో ఎవరికైనా పుట్టిన రోజు వంటివి ఉన్నప్పుడు కుటుంబ సమేతంగా, మరికొందరు బంధుమిత్రులతో కలిసి హోటళ్లకు వెళ్లి తినడం ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. సాయంత్రం పూట అలా బైక్‌లోనో కారులోనో వెళ్లి హోటల్లో కొంతసేపు సరదాగా గడిపి, ఎవరికి నచ్చిన ఆహారం వారు తినేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. బ్యాచిలర్లు రూమ్‌ల్లో అన్నం వండుకుని కర్రీలు తెచ్చుకునేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. డబ్బు పొదుపులో భాగంగా బ్యాచిలర్లు కర్రీ పాయింట్లపైన ఆధారపడుతున్నారు. అలానే రుచికరమైన ఆహారాన్ని ఇష్టపడే ఆహారప్రియులు రోజూ హోటల్ నుంచి తెప్పించుకుని లాగియిస్తున్నారు. పిల్లలు, యువత ముఖ్యంగా రుచికరమైన ఆహారం వైపు ఆకర్షితులవుతున్నారు. తిరుపతి నగరంలో 11 గంటలకు అన్ని హోటళ్లు బంద్ చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్ ఫుడ్ మాత్రం అర్ధరాత్రి ఒంటిగంట వరకు దొరుకుతుంది.



ఇంటి వంటతోనే ఆరోగ్యం



మన ఆరోగ్యం మన చేతుల్లోనే.. ఇంటి వంటలతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. అయితే కాలానుగుణంగా ఇళ్లలో ఒత్తిడి పెరగడం, తీరికలేని జీవనంతో వంటగదికి వెళ్లేందుకు కొంతమంది ఆసక్తి చూపడం లేదు. ఈ విషయాన్ని తప్పు పట్టాల్సిన పరిస్థితి లేదు. ఉన్న సమయంలో ఇంట్లోనే వంట వండుకుని తినేందుకు ఆసక్తి చూపాలి. బయటి రుచులకు అలవాటు పడితే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లే. రుచికరమైన ఆహారంతో అనారోగ్యం తప్పదు. పిల్లలకు ఇంట్లో ఆహారంపై ఆసక్తి పెంచేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలి. –డాక్టర్ మంజువాణి, పోషకాహార నిపుణురాలు, తిరుపతి

కొత్తగా పెళ్లి అయ్యింది.. వంట సరిగ్గా రాదు



మాకు కొత్తగా పెళ్లి అయ్యింది. ఏడాది కావస్తోంది. వంట చేయడం రాదు. ఎంటెక్ వరకు చదివాను. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాను. నా భర్త నగరంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో అధ్యాపకుడు. ఇద్దరికీ వంట చేయడం తెలియక పోవడంతో ప్రతిరోజు ఆన్‌లైన్ ఆర్డర్లతోనే జీవితాన్ని కొనసాగిస్తున్నాం. సెలవు రోజుల్లో మాత్రం వంట ప్రయోగాలు చేస్తుంటాం. తప్పని పరిస్థితి. –సరళ, ప్రైవేటు ఉద్యోగిని, తిరుపతి

ఇద్దరం ఉద్యోగులం తప్పని పరిస్థితి



మాది కర్నూలు. నాకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం. నా భర్త ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తారు. ఇద్దరం ఉద్యోగులం కావడంతో ఉదయమే విధులకు హాజరు కావాలి. దీంతో ఆదివారం సెలవు దినాలలో తప్ప ఇంట్లో వంట వండుకునేందుకు అవకాశం దొరకదు. దీంతో మాకు ఆన్‌లైన్ ఆర్డర్లే గతి. ఏమీ చేయలేని పరిస్థితి. పిల్లలు హాస్టల్‌లో ఉంటున్నారు. –పార్వతి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని, తిరుపతి

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

తిరుపతి అర్బన్: స్థానిక బస్టాండ్‌లోని దుకాణదారులు ప్రయాణికులకు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రజారవాణా అధికారి నరసింహులు తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆయన శనివారం తిరుపతి బస్టాండ్‌లోని పలు దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని స్పష్టం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నిషేధిత వస్తువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.



హోటల్‌లో పరిశీలిస్తున్న డీపీటీఓ నరసింహులు

సీఎస్‌ఆర్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుపతి అర్బన్: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్)కు రూ.10 లక్షల చెక్కును శ్రీసిటీ పరిధిలోని బర్గన్ పైప్ సపోర్ట్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ ఈహెచ్ఎస్ అల్తాఫ్ షేక్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు అందజేశారు. కలెక్టరేట్‌లో ఆయన శనివారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎస్‌ఆర్‌కు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీకి చెందిన భగవన్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఈహెచ్ఎస్ అల్తాఫ్ షేక్

కేంద్ర నిధులు గడువులోపు ఖర్చు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న విభునాయర్

తిరుపతి అర్బన్: వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను గడువులోపు ఖర్చు చేయాలని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ కార్యదర్శి విభునాయర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ పథకంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన మూడు ఎస్టీ కాలనీల్లో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరు ఎస్టీకాలనీ, దక్కిలి మండలంలోని కందులవారిపల్లి, వడమాలపేట మండలంలోని కదిరికుప్పంలో సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాంటివి మరిన్ని ఎస్టీకాలనీలున్నాయని, వాటిని కూడా అభివృద్ధి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ సందర్భంగా విభునాయర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన 500 మంది ఎస్టీలున్న కాలనీలను ఎంపిక చేయాలని చెప్పారు. లేదంటే 50 శాతానికి మించి ఎస్టీలున్న గ్రామాలు ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ పథకంలోకి వస్తాయన్నారు. అలాంటి గ్రామాలు జిల్లాలో మరో 25 ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఆ 25 గిరిజన గ్రామాల వివరాలను పంపాలని విభునాయర్ చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ సదా భార్గవి, ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి మల్లికార్జున నాయక్, అడిషనల్ డైరెక్టర్లు సరస్వతి, మల్లికార్జున్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ ప్రతిభాభారతి, డీడీ చంద్రిక, నెల్లూరు జిల్లా ఈడీ శ్రీనివాసరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పైసావసూల్

మంత్రి మాట..

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని కళాశాలలు విద్యార్థులను ఇబ్బంది పెట్టినా, ఫీజు కట్టాలని ఒత్తిడి చేసినా ఆ కళాశాలల భరతం పడతాం.. ఇదీ సాక్షాత్తు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హెచ్చరిక.

ఎస్వీయూ తీరు

ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న టర్మ్ ఫీజులు చెల్లిస్తేకాని పరీక్ష ఫీజు కట్టించుకోం. ఫీజురీయింబర్స్‌మెంట్ రాలేదంటే..మా కేటి సంబంధం. ఇదీ ఎస్వీయూ అధికారులు మంత్రి మాటలకు ఇచ్చిన విలువ.

అందని ఫీజు రీయింబర్స్‌మెంట్.. టర్మ్ ఫీజులు తప్పనిసరిగా చెల్లించాలని విద్యార్థులపై కళాశాలల అధికారులు ఒత్తిడి..వెరసి.. పేద విద్యార్థికి ఉన్నత విద్య భారమైంది. తీరా పరీక్ష ఫీజు చెల్లించాల్సిన సమయానికి ఎస్వీయూ అధికారులేమో పైసా వసూలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పలు కోర్సుల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

టర్మ్ ఫీజు చెల్లించకుంటే.. పరీక్ష ఫీజు కట్టించుకోం!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదంటే.. మాకేటి సంబంధం
- ఫీజు బకాయిలు చెల్లించి తీరాల్సిందే
- ఎస్వీయూలో విద్యార్థులకు అధికారుల హుకుం
- రంగంలోకి విద్యార్థి సంఘాలు.. అధికారుల తీరుపై ఆగ్రహం

తిరుపతి సిటీ: కళాశాల విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు గత ఏడాది నుంచి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దీంతో ఎస్వీయూలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో పీజీ, బీపీఈడీ, బీఈడీ చదువుతున్న పేద విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. పెండింగ్‌లో ఉన్న ఫీజులు చెల్లించాలని కళాశాల అధికారులు ఒత్తిడి చేయడంతో పలుమార్లు అధికారులను బతిమలాడినా కనికరించలేదని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి.



ప్రిన్సిపల్‌తో చర్చిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తాం

టర్మ్ ఫీజులు చెల్లించకుంటే సెమిస్టర్ పరీక్ష ఫీజును కట్టించుకోమని అధికారులు మొండివైఖరి ప్రదర్శించడం దారుణమని ఏఐఎస్ఏ, పీడీఎస్‌యూ నాయకులు చిన్న, లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ స్కాలర్ షిప్‌లు ఇవ్వకపోతే టర్మ్ ఫీజులు ఎలా కడతామని ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్ ఫీజులతో సంబంధం లేకుండా వెంటనే పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలసి పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పరీక్ష ఫీజు కట్టించుకోం!

ఎస్వీయూలో త్వరలో ప్రారంభం కానున్న పీజీ రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు దగ్గరపడుతోంది. దీంతో పీజీలోని అన్ని కోర్సుల విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టేందుకు అధికారులను సంప్రదించగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న టర్మ్ ఫీజులు చెల్లిస్తేకాని పరీక్ష ఫీజు కట్టించుకోమంటూ హుకుం జారీ చేశారు. ఫీజురీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిపులు అందలేదని బతిమలాడినా వాటితో తమకు సంబంధం లేదని తెగేసి చెప్పారు.

ఆగ్రహానికి గురికాక తప్పదు



పేద కుటుంబాల నుంచి వచ్చాం. రూ.వేలల్లో టర్మ్ ఫీజులు చెల్లించాలంటే మాటలా..అప్పులు చేసే అవకాశం లేదు. అధికారు లు వెంటనే పరీక్ష ఫీజు కట్టించుకోవాలి.లేదంటే విద్యార్థుల ఆగ్రహానికి గురికాకతప్పదు. –వంశీ, ఎంబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థి, ఎస్వీయూ

మొండి వైఖరి మార్చుకోవాలి



పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్ మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కానీ వాటితో సంబంధం లేకుండా టర్మ్ ఫీజు చెల్లించాల్సిందే నంటూ అధికారులు చెబుతున్నారు. పేద విద్యార్థులమైన మేము ఇప్పటికిప్పుడు రూ.వేలు ఎలా చెల్లించాలి. అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలి. –ఉష, బీపీఈడీ విద్యార్థిని, ఎస్వీయూ

ఆంక్షలు విధిస్తే ఏం చేయాలి



వర్సిటీలో చదువుతోంది మా లాంటి పేదలే. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబ ర్స్, స్కాలర్‌షిప్‌లు రా లేదు.. వస్తే కడతాం. టర్మ్ ఫీజు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టాలంటూ ఆంక్షలు విధిస్తే ఏం చేయాలి. –భవిత, బీపీఈడీ విద్యార్థి, ఎస్వీయూ

ఇబ్బంది పెడితే ఊరుకోం



విద్యార్థులను ఇబ్బంది పెడితే ఊరుకోం. ఈ విషయమై ఇప్పటికే పలుసార్లు అధికారులను సంప్రదించాం. అధికారులు మొండివైఖరి మార్చుకుని పరీక్ష ఫీజును కట్టించుకోవాలి. టర్మ్ ఫీజుకు ముడిపెడితే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదు. వర్సిటీ అధికారులు వైఖరి మార్చుకోకపోతే విద్యార్థి సంఘాలతో కలసి ఉద్యమిస్తాం. –చిన్న, ఏఐఎస్ఏ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

జీవితాలతో ఆటలు దారుణం



టర్మ్ ఫీజు పేరుతో పరీక్ష ఫీజు కట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం దారుణం. ఎస్వీయూ అధికారులకిది తగదు. పేద విద్యార్థులే 90 శాతం మంది వర్సిటీలో చదువుతున్నారు. వారు రూ.వేలు కట్టే పరిస్థితి లేదు. విద్యార్థులను టార్చర్ చేయడం దారుణం. –రంజిత్ కుమార్, బీపీఈడీ విద్యార్థి, ఎస్వీయూ

ఫీజు కట్టలేని పరిస్థితి



పేద విద్యార్థులు ఒక్కసారిగా అంత ఫీజు కట్టే పరిస్థితిలేదు. అధికారులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలే తప్ప, మాలాంటి పేద విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సమంజంకాదు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్ మెంట్ నిధులు స్తంభించిపోయాయి. దీంతో ఒక్క రూపాయి సైతం చెల్లించలేనిస్థితి. –వేణు, బీఈడీ విద్యార్థి, ఎస్వీయూ



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.90,770
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,220
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,03,400
రిటైల్ వెండి గ్రాము	రూ.106.40

క్లుప్తంగా

అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న రాజారెడ్డి

తిరుపతి సిటీ: వస్తు కొనుగోలులో అప్రమత్తతంగా ఉండాల్సిన అవసరం ఉందని వినియోగదారుల ఫోరమ్ చైర్మన్ రాజారెడ్డి సూచించారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మహిళా వర్సిటీ ఎంబీఏ విభాగం, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, నెహ్రూ యువ కేంద్రం సహకారంతో శనివారం వర్సిటీలో 'స్థిరమైన జీవనానికి పరివర్తన' అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఫోరమ్ చైర్మన్ రాజారెడ్డి మాట్లాడుతూ ఆహార భద్రత, కల్తీ వస్తువులు, సేవలు, బరువు, కొలతల ప్రాముఖ్యతపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

దొరవారిసత్రం: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శుక్రవారం రాత్రి దొరవారిసత్రం జాతీయ రహదారిలో అరెస్టు చేశారు. నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా కడప మండలం కనగుంది గ్రామానికి చెందిన కావాడి మురిగేష్, కట్టుమణి చలపతి ఒడిశాలో ఐదు కేజీల గంజాయి కొనుగోలు చేసి వారి ప్రాంతానికి అక్రమంగా తీసుకువెళ్లే క్రమంలో లారీలో ఎక్కి ప్రయాణిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన పోలీసులు దొరవారిసత్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటు వస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా అందులో 5 కిలోల గంజాయి ఉండగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. నిందితులను శనివారం సూళ్లూరుపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తా



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి కోన శశిధర్



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఎస్వీయూ, మహిళా వర్సిటీ విద్యార్థులు

- జిల్లా ఇన్‌చార్జి అధికారి కోన శశిధర్

తిరుపతి అర్బన్: జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి అధికారి, పాఠశాల, ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ(ఐఏఎస్)కోన శశిధర్ వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి అధికారిగా కోన శశిధర్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఉపాధి కల్పనలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ చురుగ్గా పనిచేయాల్సి ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు స్థానిక అవసరాలకు, రాష్ట్ర అవసరాలకు వీలుగా ఉండే పంటలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు రామమోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, డీపీఓ సుశీలాదేవి, డీఈఓ కేవీఎస్ కుమార్, ఎక్సైజ్ జిల్లా అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీఏఓ ప్రసాద్‌రావు, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

తిరుపతి తుడా: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి కోన శశిధర్ పిలుపునిచ్చారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు, మహిళ వర్సిటీ విద్యార్థినులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, ఏపీ టూరిజం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియం నుంచి టౌన్‌క్లబ్ సర్కిల్ వరకు విద్యార్థులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజంగా మార్చేందుకు విద్యార్థులు ప్లాస్టిక్ రహిత ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ 'రెడ్యూస్ – రీ యూస్ – రీ సైకిల్' అనే ట్రిపుల్ ఆర్ విధానాన్ని సమాజం అవలంబించాలని కోరారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణలో తిరుపతికి ప్రథమ స్థానం వచ్చేలా చూడాలని పిలుపునిచ్చారు. మహిళా వర్సిటీ వీసీ ఉమా మాట్లాడుతూ ప్లాస్టిక్ సమాజంలో విధ్వంసం సృష్టిస్తుందని, ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా నిషేధించేందుకు ప్రతిన పూనాలన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రధాన రుగ్మత అయిన క్యాన్సర్ కారకంగా ప్లాస్టిక్ వాడకమేనని, సమాజం వీలైనంతవరకు ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం న్యూబాలాజీ కాలనీలో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, మున్సిపల్, జిల్లా రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ, డాక్టర్ మునిలక్ష్మి, మునీంద్ర పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

తిరుపతి తుడా: జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు నిషేధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ తడి,పొడి చెత్త వేరు చేయడం, డ్రైనేజీలో చెత్త వేయడంతో దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతాయని తెలిపారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛదివస్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శాంతకుమారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసరావ్, మలేరియా నివారణాధికారి డాక్టర్ రూప్‌కుమార్, వరలక్ష్మి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ తమ వంతుగా ప్రతి రోజూ కొంత సమయాన్ని కేటాయించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఈఎస్‌ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం శ్యాంబాబు పేర్కొన్నారు. ఆస్పత్రిలో శనివారం ఆయన డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఈఎస్‌ఐ లబ్ధిదారులతో కలసి 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

హైవే తెచ్చిన తంటా

- హైర్ బస్సు డ్రైవర్ల వేతనం కుదింపు
- ఆందోళనలో ఆన్‌కాల్ డ్రైవర్లు

తిరుపతి అర్బన్: హైవే వచ్చింది.. వేతనం కుదించింది.. ఇదే కొత్త నినాదంగా ఉందనుకుంటున్నారు.. అవును ఇది నిజమే. నాయుడుపేట–పూతలపట్టు హైవే నిర్మాణం పూర్తయింది. ఈ అభివృద్ధి ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ల పాలిట శాపంగా మారింది. ఎందుకుంటే సాధారణంగా ఏ ఉద్యోగంలోనైనా సీనియార్టీ పెరిగే కొద్దీ జీతాలు పెరుగుతాయి. అయితే శ్రీకాళహస్తి డిపో పరిధిలో హైర్ బస్సుల్లో (అద్దె బస్సులు) పనిచేస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్ల వేతనం గత ఏడాది కంటే ఈ సారీ తగ్గిపోయింది. పలువురు డ్రైవర్లు ఏడాది ముందు నుంచి రోజువారీ రూ.1600 వేతనంతో పనిచేసేవారు. తాజాగా రోజు వారీ వేతనం రూ.1200కు తగ్గించారు. దీంతో వారంతా హైయర్ బస్సుల యాజమాన్యాన్ని ఇదేమిటని ప్రశ్నించగా గతంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి రోడ్డు అధ్వానంగా ఉండేదని, ప్రస్తుతం హైవే రోడ్డు నిర్మాణంతో వేతనం తగ్గించినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ చర్యతో అన్‌కాల్ డ్రైవర్లు నాలుగు రోజులుగా డ్యూటీలకు దూరంగా ఉంటున్నారు. దీంతో హైర్ బస్సులు బస్టాండ్‌కే పరిమితమై ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. శ్రీకాళహస్తి డిపోలో హైర్ బస్సుల్లో పనిచేస్తున్న 11 మంది అన్‌కాల్ డ్రైవర్లకు జీతాలు తగ్గించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ముగిసిన జాతీయస్థాయి సమావేశం

తిరుపతి మంగళం : నగరంలోని మానస సరోవర్ హోటల్‌లో రెండు రోజులపాటు ఎర్రచందనం విక్రయాలపై జాతీయస్థాయిలో కొనుగోలుదార్లతో నిర్వహించిన సమావేశం శనివారంతో ముగిసింది. నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ చైర్మన్ అచలేంద్రరెడ్డి, కో–చైర్మన్ పి.మల్లికార్జునరావు నేతృత్వంలో నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు సౌజన్యంతో నిపుణుల కమిటీ ఆధ్వ ర్యంలో ఎరచ్రందనం వేలం.. యాక్సెస్ బెనిఫిట్ షేరింగ్(ఏబీఎస్)పై కమిటీ సభ్యులు ప్రధానంగా బయోడైవర్సిటీ సంరక్షణ నేపథ్యంలో నిధుల సమీకరణ, రైతుల వద్ద ఉన్న ఎర్రచందనం వేలంపై చర్చించారు. రైతుల వద్ద ఉన్న ఎర్రచందనం దుంగలకు వేలం నిర్వహించేందుకు నేరుగా అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. దేశ, విదేశాల్లోని కొనుగోలుదారులతో రైతులే సంప్రదించి, నేషనల్ బయోడైవర్సిటీ ద్వారా విక్రయాలు చేసేలా ఏర్పాట్లు చేయాలని కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే వచ్చేనెలలో జాతీయస్థాయిలో నేషనల్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నిలాయపాళెం విజయ్ కుమార్, నిపుణుల కమిటీ సభ్యులు చలపతిరావు, రామలింగం, సీఎఫ్‌సీ సెల్వం, సీఎఫ్ రామకృష్ణ, తిరుపతి అటవీశాఖ పాలనాధికారి వివేక్, రిటైర్డ్ డీఎఫ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ కార్యదర్శి అని చెప్పి..

– భక్తురాలిని మోసగించిన దళారులు

తిరుమల : టీటీడీ చైర్మన్ జనరల్ సెక్రటరీనని చెప్పి శ్రీవారి దర్శనం టికెట్లు ఇప్పిస్తామని భక్తురాలిని మోసగించిన ఇద్దరు దళారులపై తిరుమల టూటౌన్ పీఎస్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన సంఘమిత్ర విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో పీజీ చదువుతోంది ఈమె శ్రీవారి దర్శనం కోసం టీటీడీ చైర్మన్ జనరల్ సెక్రటరీనని చెప్పుకునే మద్దెల దీపుబాబు, పవన్ కుమార్ అనే ఇద్దరు దళారులను ఆశ్రయించింది. దీంతో వీరు ఐదు వీఐపీ బ్రేక్ దర్శనం, ఐదు సుప్రభాతం టికెట్లు ఇప్పిస్తామని చెప్పి ఫోన్‌పేలో భక్తురాలి నుంచి రూ.2.60 లక్షలను వేయించుకున్నారు. ఆపై ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి భక్తురాలిని మోసగించారు. దీనిపై బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి దుర్మరణం



దావీదు మృతదేహం

తిరుపతి క్రైమ్: భవనం పైనుంచి పడి ఒక కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. గుంటూరుకు చెందిన అబ్రహం కుమారుడు దావీదు(56) శుక్రవారం సాయంత్రం ఆటోనగర్‌లో ఓ భవనం వద్ద పెయింట్ పనులు చేస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి కాలుజారి కింద పడ్డాడు. అయితే దీనిని గమనించిన కార్మికులు వెంటనే రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దావీదు మృతి చెందాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వారి బంధువులకు సమాచారం అందించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 63,987 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,880 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రవి మృతదేహం

తడ: జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రామాపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. తమిళనాడు, గుమ్మిడిపూండి తాలూకా, ఆరంబాకం గ్రామానికి చెందిన కే రవి (57) లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతను తన సొంత పని పని నిమిత్తం తడ మండలం, రామాపురం గ్రామం వద్ద ఉన్న సిమెంటు షాపు వద్దకు శుక్రవారం రాత్రి వెళ్లాడు. చెన్నై వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న రవిని అదే మార్గంలో వెళుతున్న ఐషర్ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రవి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు రవిని తమిళనాడులోని ఎళ్లాపూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుని కుమారుడు శనివారం ఈ మేరకు తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు మహేష్(ఫైల్)

చంద్రగిరి: ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పాతపేటలోని ముకుంద వీధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మహేష్(26) తిరుమలలో చిరు వ్యాపారం చేసుకుంటూ చంద్రగిరిలో అత్తగారింటి సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. రెండు రోజుల కిందట తన భార్య, కుమారుడు వేలూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమల నుంచి వచ్చిన మహేష్ పూటుగా మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. ఆపై శనివారం మధ్యాహ్నం మరోసారి మద్యం సేవించి మరొకరితో కాసేపు ఫోన్‌లో మాట్లాడినట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఎంతకీ ఇంటి తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి స్థానికులు తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే ఫ్యానుకు వేలాడుతూ మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషమపరీక్ష



ఓ వైపు అనారోగ్యం.. మంచం నుంచి కదలలేని దుస్థితి.. మరో వైపు ఉజ్వల భవితకు పరీక్షలు.. ఏమీ చేయాలో పాలుపోని విషమ పరిస్థితి ఆ బాలుడుది. అయినా మొక్కవోని ఆత్మస్థైర్యంతో అంబులెన్స్‌లో వెళ్లి జీవిత భరోసా కోసం పరీక్షలు రాశాడు. తిరుపతిలోని శ్రీచైతన్య కళాశాలలో సి.జీవన్‌రెడ్డి అనే విద్యార్థి ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ప్రమాదవశాత్తు అతని కుడి కాలికి బలమైన గాయం కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. శనివారం ఆఖరు పరీక్ష కావడంతో అంబులెన్స్‌లో వెళ్లి ఎయిర్ బైపాస్‌రోడ్డులోని పరీక్ష కేంద్రానికి చేరుకుని, పరీక్ష రాసి తిరిగి ఆస్పత్రికి వెళ్లాడు.

– తిరుపతి ఎడ్యుకేషన్